సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 27 । ఆగస్టు । 2025



గిరిజనుల చెంతన విద్యా దీపం

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన గిరిజన వర్సిటీ శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి.

- 2లో




వెలుగులో చీకటి కోణం

దశమంతుపురానికి చెందిన వీఓఏ రూ.2 లక్షలు స్త్రీ నిధి డబ్బులు సొంత అవసరాలకు వాడుకుని తనిఖీల్లో పట్టుబడ్డారు.

- 2లో

ఉత్సవాలకు స్వయంభూ వినాయకుడు సిద్ధం

- 2లో



సంతకవిటి మండలం మంతిన గ్రామంలోని స్వయంభూ వినాయకునికి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

న్యూస్‌రీల్

విఘ్నాలు తొలగిపోవాలి

● జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం: తెలుగు సంవత్సరంలో వచ్చే తొలి పండగ వినాయక చవితిని ప్రజలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఆది దేవుడు, విఘ్నాలు తొలగించే వినాయక చతుర్థి సందర్భంగా ఉమ్మడి జిల్లాల ప్రజలకు మంగళవారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఆ గణనాథుని చల్లని చూపుతో, ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని, రెండు జిల్లాలు అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. ఆ పార్వతీపుత్రుని అనుగ్రహంతో విఘ్నాలు తొలగి, అంతటా విజయాలు సిద్ధించాలని కోరారు. పర్యావరణ హితంగా పండగను జరుపుకోవాలని, మట్టి విగ్రహాలను పూజించాలని విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు పాటించాల్సిందే..



ఏర్పాట్లపై అధికారులను ప్రశ్నిస్తున్న సబ్ కలెక్టర్ వైశాలి

పార్వతీపురంటౌన్: వినాయక మంటపాల ఏర్పాటులో ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందేనని సబ్ కలెక్టర్ డా.ఆర్ వైశాలి స్పష్టం చేశారు. వినాయక చవితి పండగ నిర్వహణ, పర్యవేక్షణపై సంబంధిత అధికారులతో సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఎస్పీ అంకితా సురానాతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైశాలి మాట్లాడుతూ మంటపాలను రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేయరాదన్నారు. డీజే సౌండ్ సిస్టం నిషేధమన్నారు. తిరువీధి, అనుపోత్సవాల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యావరణ హితం దృష్ట్యా మట్టి విగ్రహాలను పూజించేలా చూడాలన్నారు.

స్థలాలు గుర్తించండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: జిల్లాకు 80 పంచాయతీ భవనాలు మంజూరయ్యాయని, వీటిలో స్థలాలున్నచోట 68 భవనాల నిర్మాణానికి పరిపాలనా ఆమోదం మంజూరు చేసినట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మిగిలిన 12 భవనాల నిర్మాణానికి వెంటనే స్థలాలను గుర్తించి గ్రౌండింగ్ చేయాలని పంచాయతీరాజ్ సహాయ కార్యనిర్వహణ ఇంజనీర్లను ఆదేశించారు. ఒక్కో భవనాన్ని రూ.32 లక్షల నిధులతో పూర్తిచేయాలన్నారు. ఈ నెల 28, 29, వచ్చేనెల 2, 3 తేదీల్లో ఆదికర్మయోగి శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ రామచంద్రరావు, ఐటీడీఏ ఏపీఓ మురళీకృష్ణ, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో పక్షపాతం



కెమిశీలలో యూరియా కోసం వేచిఉన్న రైతులు

కొమరాడ: మండలంలోని కెమిశీల రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీలో వ్యవసాయ సహాయకురాలు పక్షపాత ధోరణిపై రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఆర్ఎస్‌కేకు 200 బస్తాల యూరియా వచ్చింది. కూటమి నాయకులు చెప్పినవారికే యూరియా బస్తాలు ఇవ్వడంతో సాధారణ రైతులు నిలదీశారు. గాజులుగూడ, తులసివలస, బందవలస తదితర గ్రామాల రైతులు కూటమి నాయకుల ఒత్తిడితో ఏఏఓ అనుసరిస్తున్న తీరును తప్పుబట్టారు. రైతులందరికీ యూరియా అందజేయాలని డిమాండ్ చేశారు.

మడ్డువలసకు వరద తాకిడి



రెండు గేట్ల నుంచి విడిచిపెట్టిన వర్షం నీరు

వంగర: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 2,500 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులో చేరుతోంది. ప్రాజెక్టు వద్ద 64.49 మీటర్ల నీటిమట్టం నమోదైంది. రెండు గేట్లు ఎత్తి 4వేల క్యూసెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచిపెడుతున్నట్టు ఏఈ నితిన్ తెలిపారు.

వినాయకుడి పూజకు వెయ్యి విఘ్నాలు..!



పింఛను తీసేశారు గణనాథ..

పండగ సామాన్లు తెచ్చేరాదూ అని మా ఇంటాయన సింహాచలానికి చెప్తే ఒసేయ్.. ముసలీ.. అన్నీ తెలిసి ఇలాగంటావేంటి అని నామీదకి ఎగురుతున్నాడు. నీకు నాకు ఇద్దరికీ పెన్షన్లు పోనాయి.. నాకేమో చత్వారం.. కళ్లు ఆనవు. పెన్షన్ పోయింది. మళ్లీ ఆస్పత్రికి వెళ్లి చెకింగ్ చేయించుకుని సర్టిఫికెట్ చూపించాలట. నేను ఆపనిమీద వెల్తన్ను. నాకిప్పుడు పండుగ పనులు గట్రా చెప్పకు. పెరట్లో సీతాఫలం చెట్టు ఆకులు నాలుగు దూసుకొచ్చి... గరికి పూస, పసుపు ముద్దా కలిపి వినాయకుణ్ణి చేసి ఈసారికి ఏదోలా మమ అనిపించు అని చీరాకుపడిపోతాండు.. మనవడికి చెప్పినా వినడం లేదు గణేశా.. ఒసేయ్.. అమ్మమ్మా.. విఘ్నేశ్ అని పేరు పెట్టావు కానీ నాకు అమ్మకు వందనం డబ్బులు రాలేదు. ఇక చదువు ఎలా చదవాలే.. అని నన్ను అడుగుతున్నాడు స్వామి.!




- విఘ్నాలు తొలగించాలంటూ వేడుకుంటున్న ప్రజలు
- హామీలిచ్చి విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం
- అమలుకాని హామీలతో తప్పని ఎదురుచూపు
- నీ తొలిపూజతోనైనా ప్రభుత్వం బుద్ధి మార్చాలంటూ వేయివేల పూజలకు సన్నద్ధం

సాక్షిప్రతినిధి విజయనగరం:


స్వామీ గణేశా.. ఈసారి ఎలాగైనా నీ పండగ గట్టిగా చేద్దాం అనుకున్నాను.. కనీసం కూటి కుండ సైజు లడ్డు పెడదాం అనుకున్నాను.. కానీ మరేటి సేత్తాను.. పరిస్థితులు, చంద్రబాబు కలిపి ఒకేసారి మా పేదోళ్లమీద పగబట్టేసినారు.. అందుకే ఇదుగో.. రెండు రూపాయల కొబ్బరిబిళ్ల ముందెడుతున్నాను.. నువ్వు తొండంతో అలా టచ్ చేసి వదిలేస్తే మళ్లా మా మనవడికి ఇచ్చి బడికి పంపాలి.. ఏమైనా అనుకో గణేశా... జగన్ దిగిపోయాక పేదల బతుకులు తలకిందులైపోనాయి. పేదలంటేనే నచ్చని చంద్రబాబు ఎప్పుడైతే కుర్చీ ఎక్కాడో.. ఆ రోజు నుంచి మా బతుకులు జారుడుబల్ల మీది గుండ్రాయిలా గుడుగుడుమంటూ కిందికి జారిపోతున్నాయి.. తెల్లారితే చాలు.. ఏ పథకం ఎత్తేస్తాడో తెలీదు.. చీకటైతే చాలు ఏ తాగుబోతోడు మా ఇంటిముందు గొల్లుగొల్లు పెడతాడో తెలీదు.. మొత్తానికి రాష్ట్రం మొత్తం ఏడాదిలో అల్లకల్లోలం అయిపొయింది ఉండ్రాలయ్యా.. ఒరేయ్ గుంటడా గణపతికి పత్తిరి పట్టుకురారా అని మా పిక్కిరోడికి చెప్తే.. గణపతికి ఊరందరూ పత్తిరి పెడతార్లే.. మనం ఒక్కరం పెట్టకపోతే నష్టం లేదు.. యూరియా కోసం నేను లైన్లో నిలబడకపోతే చేను ఏపుగా పెరగదు.. ముందు యూరియా తెచ్చాకే పత్తిరి అనేశాడు మా జమ్మినాయుడు. చూశావా గణపతీ.. అప్పట్లో ఎరువులన్నీ ఆర్బీకెల్లో మా ఊళ్లోనే దొరికేవి.. ఇప్పుడు అదేదో సినిమా టికెట్ల కోసం నిలబడినట్లు ఎండలో.. వానలో లైన్లో నిలబడాలట. ఆడు వచ్చినాక ఏదో గరికో.. పరకో తెస్తాడు మరి.. దాంతోనే నీకు ఈ పూటకు పండగ మరి. అలా సర్దుకుపోవాలి మరి.. కుదరదు.. భారీగా ఉండాలని తొండం తిప్పితే కుదరదు.. చూస్తున్నావు కదా మా బాధలు ఎలా ఉన్నాయో..!

ఉద్యోగం లేదు.. నిరుద్యోగ భృతికి అతిగతీ లేదయ్యా..

చంద్రబాబిచ్చే ఇరవైలచ్చల ఉద్యోగాల్లో వాడికొకటైనా రాకపోతుందా అని మా పెద్ద మనవడు ఒకటే ఎదురు చూపులు గణేశా.. పోనీ అందాక నెలకు ఇస్తామన్న మూడువేల రూపాయల నిరుద్యోగ భృతి అయినా వస్తే బాగుణ్ణు.. జేబు ఖర్చులకు వచ్చేదని ఆశపడ్డాడు. అయినా చంద్రబాబును నమ్మితే నిరాశ తప్ప ఇంకేం ఉండదని తెలియని వెర్రి నాగన్న నా మనవడు.. వాణ్ని నువ్వే చూసుకోవాలి గణేశా.. మా యమ్మికి అప్పట్లో జగనన్న ఉన్నప్పుడు ఆసరా డబ్బులొచ్చేవి.. ఇప్పుడు అవన్నీ దుకాణం సర్దేశాడు చంద్రబాబు.. ఇక బాబును నమ్ముకో.. ఉన్నదంతా అమ్ముకో అన్నట్లుగా తయారైంది మా బతుకు. అయినా అన్నీ తెలిసినవాడివి నీకేం చెప్పగలను.. స్వామి!



మహిళలకు మూడు నామాలు పెట్టిన చంద్రాలు సార్....



మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం అంటే నమ్మేశాం. అదంతా గ్యాస్ సిలిండర్లు కాదు.. గ్యాస్ అని మెల్లగా అర్థమైంది. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే మా మహిళలకు మూడు నామాలు పెట్టేశాడు. ఏడాదికి మూడు ఉచితంగా గ్యాస్ సిలెండర్‌లు ఇస్తామని చెప్పి కేవలం ఒక్కటంటే ఒక్కటే ఇచ్చి చేతులు దులుపుకున్నాడు. అవి కూడా కొంతమందికే వచ్చాయట. మిగిలిన వారు మాకు ఎప్పుడు సబ్సిడీ డబ్బులు పడతాయేనని కళ్లు కాయాలు కాసేలా ఎదురు చూస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సులు వేయిస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు ఆర్టీసీలో ఉన్న 20 రకాల సర్వీసుల్లో కేవలం 5 సర్వీసుల్లో మాత్రమే వచ్చి పోవాలని చెప్పకనే చెప్పేశారు. ఆ బస్సుల్లో సీట్లు కోసం మాలో మేమే తన్నులాడుకునే దుస్థితికి దిగజార్చారు. ఇక మేం బతకడమే కష్టంగా ఉంది.. ఇక ఇంకేం పండగ చేస్తాం స్వామీ..!

ప్రభుత్వం బుద్ధి మారేలా చూడవయ్యా..

అందరి కష్టాలు తీర్చే నీ పండగ టైముకు జనాలకు కష్టాలు తెచ్చిపెట్టింది ఈ ప్రభుత్వం.. ఏం చేద్దాం వచ్చే ఏడాదికైనా ఈ ప్రభుత్వం బుద్ధి మారేలా చూడవయ్యా.. అప్పటికైనా మా కష్టాలు తీరి.. అన్నీ అనుకున్నట్లు జరిగితే నీకు కొబ్బరి బిళ్లకు బదులుగా ఒరిజినల్ లడ్డూ పెడతాను.. అయినా అదేంటి గణపతీ గతంలో మా ఊళ్లో ఎక్కడా బెల్ట్ షాపే ఉండేది కాదు.. ఈ సారి చూస్తే వీధి కొకటి చొప్పున మొత్తం ఐదు బెల్ట్ షాపులున్నాయి. కుర్రోళ్లంతా పొద్దల్లా తాగి తందానాలు ఆడతన్నారు. సాయంత్రం వీధిలోకి వెళదామంటే భయంగా ఉంది. ఈ గణపతి నవరాత్రులు ఎంతలా తాగి ఊగుతారో చూస్తేనే భయంగా ఉంది స్వామి. ఏమో నీ పండగ .. నీ ఇష్టం.. ఎలా చేసుకుంటావో. ఎలా చేయించుకుంటావో నీ దయ... ఉంటాను మరి. .. చల్లగా బతికుంటే వచ్చే ఏడాది కలుద్దాం..!



పొలం బాట...



వర్షాలు కురుస్తుండడంతో ఓ వైపు ఊభాలు... మరోవైపు వరి చేలలో కలుపుతీత పనులు ఊపందుకున్నాయి. పల్లె ప్రజలు ఉదయాన్నేలేచి క్యారేజీలు పట్టుకుని పొలంబాట పడుతున్నారు. పొద్దుకుంకేవరకు పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. మహిళా కూలీలకు డిమాండ్ పెరిగింది. వరి చేలలో కలుపుతీత పనులకు రోజుకు రూ.250 నుంచి రూ.300 వరకు కూలి గిట్టుబాటవుతోంది. గుంపులు గుంపులుగా పొలాలకు చేరుకుంటున్నారు. దీనికి పాలకొండ–వీరఘట్టం రోడ్డులో పొలంబాట పట్టిన మహిళల చిత్రమే సజీవ సాక్ష్యం.

- పాలకొండ రూరల్

స్మార్ట్ కార్డులు సరే.. సరుకులేవీ?

విజయనగరం ఫోర్ట్: ఓ వైపు రాష్ట్ర ఖజనాలో డబ్బులు లేవని కూటమి ప్రభుత్వం గగ్గోలు పెడుతోంది. మరోవైపు గత ప్రభుత్వ ఆనవాళ్లను దూరం చేసేందుకు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందన్నది జనం మాట. దీనికి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీయే నిలువెత్తు నిదర్శనం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన రైస్ కార్డులు బాగానే ఉన్నా ఇప్పుడు కోట్లాది రూపాయలు ఖర్చుచేసి స్మార్ట్ కార్డుల పంపిణీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 5,73,137 రైస్ కార్డులు ఉన్నాయి. వీరికి కూటమి సర్కారు స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేస్తోంది. దీనికోసం రూ.6 కోట్లకు పైగా నిధులు వెచ్చిస్తున్నట్టు సమాచారం. స్మార్ట్ కార్డులపై ఉన్న శ్రద్ధ పేద ప్రజలకు ఇచ్చే నిత్యావసర వస్తువులపై లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత ఏడు నెలలుగా కందిపప్పు సరఫరా నిలిపివేసి... ఇప్పుడు కార్డులంటూ కొత్త డ్రామాకు తెరతీయడాన్ని దుయ్యబడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.130 నుంచి రూ.140 వరకు ఉంది. రేషన్ షాపుల్లో రాయితీపై కేజీ రూ.67 చొప్పున అందించేవారు. జిల్లాలో రేషన్ లబ్ధిదారులకు అందజేసేందుకు నెలకు 5,73,137 కిలోల కందిపప్పు అవసరం. ఈ లెక్కన నెలకు రూ.7 కోట్లు వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఏడు నెలలుగా కందిపప్పు ఇవ్వక పోవడం వల్ల రూ.35 కోట్లు వరకు కూటమి ప్రభుత్వం భారం తగ్గించుకుంది. పేదలకు పప్పును దూరం చేసింది. బయటమార్కెట్‌లో కొనుగోలు చేసుకుంటున్న రేషన్ లబ్ధిదారులపై ఆర్థిక భారం పడుతోంది.



స్మార్ట్ రైస్ కార్డు

వంట తంటాలు..!



వంగర మండల పరిధి ఎం.సీతారాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వంట గది లేక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో చదువుతున్న 245 మంది విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజనం వడ్డించేందుకు తంటాలు తప్పడంలేదు. ఎండలు కాసిన సమయంలో చెట్ల నీడన వంటలు చేస్తున్నా వర్షం కురిస్తే ఇబ్బందులు పడుతున్నారు. వంటగది నిర్మాణం కోసం ప్రతిపాదించామని, ఇంకా మంజూరు చేయలేదని హెచ్‌ఎం కోటేశ్వరరావు తెలిపారు.

– వంగర

వినాయక పూజకు వేళాయె..



పార్వతీపురం మార్కెట్‌లో చవితి సందడి

పార్వతీపురంటౌన్: వినాయక పూజకు వేళయింది. పల్లెలు, పట్టణాలు సందడిగా మారాయి. వీధివీధినా వెలసిన మంటపాలు, విద్యుత్ దీపాల అలంకరణలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. పల్లె నుంచి పట్టణం దాకా... మురికివాడల నుంచి ఖరీదైన అపార్ట్‌మెంట్ల వరకు ఎవరి స్థాయిలో వారు అంబరాన్నంటేలా బుధవారం జరుపుకునే విఘ్నేశ్వర పూజకు సర్వం సిద్ధం చేశారు. వినాయక విగ్రహాలు, ప్రతిమలు, పూజాసామగ్రిని మంగళవారం కొనుగోలు చేసి వాహనాల్లో మంటపాలకు తరలించారు. పర్యావరణ స్పృహతో పలు స్వచ్ఛంద సంస్థలు మట్టి ప్రతిమలను పంపిణీ చేశాయి. పార్వతీపురం మార్కెట్‌లో చవితి సందడి కనిపించింది. పత్రి, పండ్లు, పూలు, వినాయక వ్రత పుస్తకాల అమ్మకాలు జోరుగా సాగాయి.



వాహనంపై వినాయక విగ్రహాన్ని తీసుకెళ్తున్న యువకులు

8 బార్లకు రెండే దరఖాస్తులు

● మిగిలినది మరో రెండు రోజులే..

పార్వతీపురం టౌన్: ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన బార్ పాలసీపై వ్యాపారులు మొఖం చాటేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 8 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేయగా ఇప్పటివరకు కేవలం 2 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఒక్కో బార్‌కి 6 నుంచి 10 దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ అధికారులు భావించారు. ఈ నెల 29తో దరఖాస్తు గడువు ముగుస్తుంది. మిగిలినది రెండు రోజులే అయినా ఎన్‌రోల్‌మెంట్ చూస్తే అంతంత మాత్రంగానే ఉంది. సెప్టెంబర్ 1 నుంచి బార్‌లు ఉంటాయా అనే సందిగ్ధంలో దరఖాస్తుదారులు ఉన్నారు. ఒక్కో షాపుకు రూ.5.10 లక్షల చొప్పున దరఖాస్తు ఫీజు చెల్లించి 4 దరఖాస్తులు సమర్పించాలన్న నిబంధన పెట్టినా ఎన్‌రోల్‌మెంట్ అంతంత మాత్రంగానే ఉంది. బార్ పాలసీలో మార్పులు చేయకపోతే నెలకు కనీసం రూ.10 లక్షల వరకు నష్టం భరించాల్సి ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో బార్‌ల ఏర్పాటుకోసం రెండు దరఖాస్తులే వచ్చాయని, గడువు ఈ నెల 29 సాయంత్రం 5 గంటలతో ముగుస్తుందని, ఈ నెల 30న ఓపెన్ కేటగిరీ, గీత కార్మికులకు సంబంధించి కలెక్టర్ కార్యాలయ పీజీఆర్ఎస్ హాల్‌లో లాటరీ పద్ధతిలో బార్ల కేటాయింపు జరుగుతుందని జిల్లా ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు తెలిపారు.

అధ్యక్ష పీఠంపై తమ్ముళ్ల సమరం!

- 'ప్రాంతాల' మధ్య పోటీ
- పెరుగుతున్న ఆశావహులు
- తెరపైకి రెండు వేర్వేరు అధ్యక్షులు
- కుదరని ఏకాభిప్రాయం

సాక్షి, పార్వతీపురం మన్యం:

అరకు పార్లమెంట్ టీడీపీ అధ్యక్ష పీఠంపై 'తమ్ముళ్ల' మధ్య ఆసక్తికర సమరం నడుస్తోంది. ప్రధానంగా అటు ఏఎస్ఆర్.. ఇటు పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి పోటీ ఏర్పడింది. ఈ సారి ఎలాగైనా అధ్యక్ష పదవి తమకే ఇవ్వాలని రెండు జిల్లాల నుంచి పలువురు పోటీ పడుతున్నారు. దీనిపై రెండు రోజుల కిందట విశాఖపట్నంలో త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా నుంచి ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఎవరికి వారు తమ వాణిని వినిపించారు. వాస్తవానికి అరకు పార్లమెంట్ స్థానం ఎస్టీ సామాజిక వర్గానికి రిజర్వ్ చేశారు. ఈ పార్లమెంట్ ఏర్పడిన తర్వాత ఇక్కడ టీడీపీ ఒక్కసారి కూడా గెలిచిన దాఖలాలు లేవు. కొన్ని దఫాలుగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే అరకు పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అన్ని విధాలా బలమైన వ్యక్తిని అధ్యక్షునిగా నియమించాలన్న ఆలోచనలో ఉంది. మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో అధ్యక్ష పీఠం మళ్లీ ఎస్టీకి కేటాయిస్తారా, లేక మరో సామాజిక వర్గానికి అవకాశం కల్పిస్తారా? అన్నది చూడాలి. ఒకవేళ అధ్యక్ష పదవిని ఎస్టీకి ఇస్తే.. ప్రధాన కార్యదర్శి బాధ్యతలు ఎస్టీ లేదా బీసీ సామాజిక వర్గానికి కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

తెరపైకి ఇద్దరు వేర్వేరు అధ్యక్షులు?

మరోవైపు అరకు పార్లమెంట్ నియోజకవర్గాన్ని రెండు జిల్లాలుగా విభజించి అధ్యక్షులను నియమించాలన్న డిమాండ్ కూడా ఉంది. మన్యం జిల్లా పార్టీ అధ్యక్షునిగా బీసీ నాయకునికి అవకాశం ఇవ్వాలని పలువురు కోరుతుండగా.. ఎస్టీకి ఇవ్వాలని మంత్రి సంధ్యారాణి తదితరులు గట్టిగా డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. పార్టీ నాయకత్వంలో కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాలకు ప్రాధాన్యమివ్వాలని విప్, ఎమ్మెల్యే జగదీశ్వరి అడుగుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకే అధ్యక్ష పదవి కేటాయించాలని.. ప్రస్తుతం ఉన్న అధ్యక్షుడినే కొనసాగించాలన్న డిమాండ్లూ అటు నుంచి వినిపిస్తున్నాయి. ప్రస్తుత పార్లమెంట్ అధ్యక్షునిగా కె.శ్రవణ్ కుమార్ ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు కూడా అధ్యక్ష పీఠం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.



జిల్లాలో ఆశావహుల జాబితా పెద్దదే..

అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధి ఎక్కువ. పార్వతీపురం మన్యం జిల్లాలో కేవలం నాలుగు నియోజకవర్గాలే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఏఎస్ఆర్‌కు, మన్యం జిల్లాలకు వేర్వేరు అధ్యక్షుల నియామకం తెరపైకి వచ్చింది. అటు ఎస్టీకి ఇచ్చేసినా.. ఇటు బీసీకి ఇవ్వాలని పలువురు పట్టుపడుతున్నారు. మన్యం జిల్లా నుంచి అధ్యక్ష పదవి రేసులో చాలా మంది పోటీ పడుతున్నారు. జిల్లాలో మూడు ఎస్టీ, ఒక్కటి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలున్నాయి. ఇక్కడ రిజర్వేషన్ కారణంగా బీసీ, ఇతర సామాజిక వర్గాలకు ఎటువంటి సముచిత పదవులూ దక్కడం లేదన్న అసంతృప్తి ఉంది. బలమైన సామాజిక వర్గ నాయకులు తెర వెనుక పాత్రకే పరిమితమవుతున్నారు. ఈసారైనా ఆ పరిస్థితిని మార్చాలని పలువురు కోరుతున్నారు. మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ ఈ పదవి చేపట్టేందుకు విముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. కురుపాం నియోజకవర్గం నుంచి వైరిచర్ల వీరేశ్‌చంద్రదేవ్, ఉమ్మడి విజయనగరం జిల్లా మాజీ గ్రంథాయల చైర్మన్ దత్తి లక్ష్మణరావు తదితరులు ఆశిస్తున్నారు. వీరేశ్‌చంద్రదేవ్ 2024 ఎన్నికల్లో కురుపాం టీడీపీ ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. చివరి క్షణంలో తోయిక జగదీశ్వరి పేరును అధిష్టానం ఖరారు చేసింది. దీంతో అయిష్టంగానైనా పార్టీ గెలుపునకు ఆయన కృషి చేశారు. గెలిచిన తర్వాత ఎమ్మెల్యే జగదీశ్వరి వర్గం .. ఆయనను పూర్తిగా పక్కన పెట్టేసిందన్న అసంతృప్తి వీరేశ్‌చంద్రదేవ్ వర్గీయుల్లో ఉంది. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు ఈయన బంధువు కూడా. ఆ పరిచయంతోపాటు, వైరిచర్ల కుటుంబం నేపథ్యం ఆయనకు కలిసొస్తుందని సన్నిహితులు అంటున్నారు. ఇదే నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన దత్తి లక్ష్మణరావు కూడా పార్టీలో కీలక పదవి ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. పార్వతీపురం నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు పేర్లు కూడా వినిపిస్తున్నాయి. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్రతో వీరికి బహిరంగంగానే విభేదాలు ఉన్నాయి. జగదీష్‌కు బలమైన సామాజిక వర్గ నేపథ్యం ఉంది. పార్టీ సీనియర్ నేత అయినప్పటికీ.. గత ఎన్నికలకు ముందు నుంచి బోనెల విజయ్‌చంద్ర ఏకపక్ష నిర్ణయాలతో ఆయన తెరమరుగయ్యారు. వీరితోపాటు.. మరికొంతమంది కూడా పార్టీలో ముఖ్య పదవుల కోసం పోటీ పడుతున్నారు.

క్లుప్తంగా

29న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

సాలూరు: ఈ నెల 29 న సాలూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఉషశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. దివిస్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మేళా శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని అన్నారు.ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9440537105 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్థాయి పారా త్రోబాల్ పోటీలకు సచివాలయం ఉద్యోగి


జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన శ్రీను

కొత్తవలస: మండలంలోని గనిశెట్టిపాలెం గ్రామ సచివాలయంలో డిజిటల్ సహాయకుడిగా పనిచేస్తున్న పాటిపిరెడ్డి శ్రీను జాతీయ స్థాయి పారా త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఒక ప్రకటనలో మంగళవారం ఆయన తెలిపారు.ఈ నెల 8వ తేదీన విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీను ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా శ్రీనును పలువురు అభినందించారు.

4.8 కేజీల గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయి, నిందితులు

సంతకవిటి: మండలంలోని పొనుగుటివలస పరిధిలోని జీఎంఆర్ఐటీ కళాశాల ఎదురుగా గల మామిడి తోటలో సోమవారం సాయంత్రం 4.8కేజీల గంజాయిని పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు నలుగురు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. పాలకొండ ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని సోమవారం రాత్రి కేసు నమోదు చేసి మంగళవారం వారిని అంపోలు సబ్‌జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు.

సాలూరులో 5.60 కిలోల గంజాయి..

సాలూరు: పట్టణంలో ఇద్దరు వ్యక్తుల నుంచి గంజాయిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ పాత బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారని అందిన సమాచారం మేరకు వారి వద్దకు వెళ్లి విచారణ చేస్తున్న క్రమంలో తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఆ వ్యక్తుల బ్యాగుల్లో 5.60 కేజీల గంజాయిని గుర్తించామని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశామని, నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

ఏనుగుల గుంపుతో జాగ్రత్త

కొమరాడ: మండలంలోని కోటిపాం పరిసరాల్లో ఉన్న పంట పొలాల్లో తొమ్మిది ఏనుగుల గుంపు సంచరిస్తోంది. అయితే కోటిపాం గ్రామస్తులు సాయంత్రం ఆరుగంటల నుంచి తెల్లవారుజామున ఆరు గంటల వరకు బయటకు రావద్దని జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన మంగళవారం ఒక ప్రకటనలో తెలయజేశారు. బయటకు రావాల్సి వస్తే అటవీశాఖ సిబ్బంది సహాయం కోరాలని ఆమె సూచించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹236

గిరిజనుల చెంతన విద్యా దీపం

- నెరవేరనున్న జగనన్న ఆశయం
- కేంద్రియ విశ్వ విద్యాలయానికి సొంత క్యాంపస్
- రూ.834 కోట్లతో సువిశాల ప్రాంగణంలో భవన నిర్మాణం
- ఇప్పటికే సిద్ధమవుతున్న అడ్మిన్, అకడమిక్ బ్లాక్ బిల్డింగ్‌లు
- వచ్చే విద్యా సంవత్సరానికి అంతా సిద్ధం


కేంద్రియ విశ్వవిద్యాలయ శంకుస్థాపనకు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి వస్తున్న నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

దత్తిరాజేరు: కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయనికి 2023 ఆగస్టు 25వ తేదీన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన చోటే శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి, గిరిజనుల జీవితాల్లో కాంతులు నింపాలంటే ఈ విద్యాదీపం నిబంధనల ప్రకారం వారి చెంతనే ఉండాలన్న కృత నిశ్చయంతో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. ప్రస్తుతం విజయనగరం శివారు గాజులరేగ వద్ద ఏయూ స్టడీ సెంటర్లో తాత్కాలికంగా కొనసాగుతోంది, ఈ ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థను ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన సాలూరు పరిధిలోని మెంటాడ మండలం, గజపతినగరం నియోజకవర్గం పరిధిలోని దత్తిరాజేరు మండలాల మధ్యలో చినచామలాపల్లి, మర్రివలస రెవెన్యూలో 561.88 ఎకరాల విస్తీర్ణంలో సువిశాలమైన ప్రకృతి రమణీయతతో చక్కని ప్రాంతంలో విద్యా సౌరభాలు విరబూయనున్నాయని ఈ ప్రాంత ప్రజలు, విద్యావేత్తలు ఆనందోత్సాహంలో ఉన్నారు. 120 అడుగుల వెడల్పు రోడ్డు పనులతో పాటు తరగతి భవనాలు(అకడమిక్ బ్లాక్) పరిపాలన భవనం (అడ్మిన్ బిల్డింగ్) బాలికలు, బాలురు వసతి గృహాలు రానున్న విద్యా సంవత్సరానికి పూర్తి చేయడానికి కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎప్పటికప్పుడు ఆరా తీస్తుండడంతో పనులు చక చకా జరుగుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు.


అకడమిక్ బ్లాక్

పూర్తిస్థాయిలో సౌకర్యాల కల్పన కోసం

కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయంలో తాగునీరు ఇతరత్రా నీటి అవసరాలను తీర్చేందుకు రూ.7 కోట్లతో డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ పనులు గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభమై పూర్తయ్యాయి. అలాగే పైప్‌లైన్ పనులు కూడా కొలిక్కి వస్తున్నాయి, మౌలిక వసతుల కల్పనకు నిధులు, రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారం చెల్లింపునకు గత ప్రభుత్వం హయాంలోనే రూ.61.06 కోట్లు మంజూరై పంపిణీ కూడా జరిగింది. రూ.16 కోట్లు అప్రోచ్ రోడ్డుకు డ్రైయిన్లు, అలాగే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం మరో రూ.48.61 లక్షలు కేటాయించింది. అప్పటికే ఆ భూముల్లో ఉన్న 220 కేవీ విద్యుత్ టవర్లు తొలగించడానికి రూ.12.43 లక్షలు మంజూరు చేయడంతో పనులు జరుగుతున్నాయి,

ఫలిస్తున్న నాయకుల కృషి

ఉత్తరాంధ్రకు పెద్ద దిక్కయిన రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత, అప్పటి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెనుకబడిన ప్రాంతంలో గిరిజన నియోజక వర్గానికి విద్యా కుసుమం లాంటి వర్సిటీ రావాలని అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గిరిజన శాఖ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరతో కలిసి ఒప్పించడంతో నేడు ఉమ్మడి జిల్లా విజయనగరంలో వర్సిటీ నిర్మాణం జరగడం శుభపరిణామమని పులువురు ప్రశంసిస్తున్నారు. వర్సిటీ ముఖద్వారం గజపతినగరం నియోజకవర్గం వైపు రావడంతో జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగడానికి అప్పటి గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య చేసిన కృషిని నియోజకవర్గ, జిల్లా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. యూనివర్సిటీకి వైజాగ్. భోగాపురం ఎయిర్ పోర్టులు దగ్గరగా ఉండడం, కోమటిపల్లి, బొబ్బిలి రైల్వే స్టేషన్లు కూడా దగ్గరలో ఉండడంతో దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి విద్యను అభ్యసించేందుకు వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం చాలా దగ్గరగా ఉండడం గమనార్హం.


నిర్మాణంలో ఉన్న విద్యార్థుల వసతి గృహం


నిర్మాణం జరుగుతున్న వైస్ చాన్స్‌లర్ బంగ్లా


వేగవంతంగా జరుగుతున్న గెస్ట్‌హౌస్ నిర్మాణం

అర్హులకు కారుణ్య నియామకాలు

- హోంగార్డ్స్ కుటుంబాలతో ఎస్పీ మమేకం


హోంగార్డ్స్ కుటుంబాలతో సమావేశమైన ఎస్పీ, ఏఎస్పీ

విజయనగరం క్రైమ్: మృతిచెందిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. పోలీసు ఉద్యోగుల కుటుంబాల్లో అర్హత ఉన్న వారికి కారుణ్య నియామకాల కోసం చర్యలు చేపడతామని, ఎలాంటి సమస్యలున్నా, సందేహాలున్నా, సహాయం కావాలన్నా నేరుగా తనను కలవవచ్చని ఎస్పీ అన్నారు. మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబాలతో డీపీఓలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ మంగళవారం సమావేశమయ్యారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సర్వీసు బెనిఫిట్స్, వారి సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. మృతి చెందిన ఒక్కొక్క పోలీసు కుటుంబానికి పెండింగ్‌లో ఉన్న సరీస్ బెనిఫిట్స్, ప్రస్తుతం వాటి స్థితి, ప్రగతి, కుటుంబంలో అర్హత కలిగిన వ్యక్తులకు కారుణ్య నియామకాలు చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి కార్యాలయ అధికారులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు మినహా మిగిలిన వారికి అన్ని బెనిఫిట్స్ ఇప్పటికే అందజేశామని తెలిపారు. ఇంకనూ కొన్ని కుటుంబాలకు పెండింగ్‌లో ఏపీజీఎల్ఐ, జీఐఎస్, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్, పెన్షన్, భద్రత ఎక్స్‌గ్రేషియా వంటి బెనిఫిట్స్ మరణించిన పోలీసు కుటుంబాలకు త్వరితగతిన మంజూరు చేసేందుకు సంబంధిత అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నామని ఎస్పీ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టేందుకు అర్హతలు కలిగిన వ్యక్తులు వెంటనే సర్టిఫికెట్లు జిల్లాపోలీసు కార్యాలయంలో అందజేస్తే, కారుణ్య నియామకాలకు చర్యలు చేపడతామన్నారు. కాగా ఇటీవల ట్రాఫిక్ పోలీసు స్టేషనులో విధులు నిర్వహిస్తూ హోంగార్డ్ పి.శ్రీనివాసరావు మరణించగా, వెల్ఫేర్ గ్రాంట్ కింద మంజూరైన రూ.15 వేల చెక్కును ఆయన సతీమణి పి.లక్ష్మీ ప్రసన్నకు ఎస్పీ వకుల్ జిందల్ అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డీపీఓ పరిపాలనాధికారి పి.శ్రీనివాసరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.గోపాల నాయుడు, ఆఫీసు సూపరింటెండెంట్లు టి.రామకృష్ణ, వెంకటలక్ష్మి, ఆర్ఎస్సై ప్రసాదరావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీనివాస రావు, జిల్లా పోలీసు కార్యాలయం ఉద్యోగులు, పోలీసు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఎంపీఎఫ్‌సీ గొడౌన్‌లకు బిల్లుల చెల్లింపు


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: నిర్మాణాలు పూర్తయిన ఎంపీఎఫ్‌సీ (మల్టీ పర్పస్ ఫెసిలిటేటింగ్ సెంటర్) గొడౌన్‌లకు బిల్లుల చెల్లింపులకు ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సహకార శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన జిల్లాలో నిర్మిస్తున్న ఎంపీఎఫ్‌సీ గొడౌన్‌ల పనులపై సమీక్ష చేశారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తయిన 11 గొడౌన్లకు ఫైనల్ పేమెంట్, ఒక గొడౌన్‌కు పార్ట్ ఫైనల్ పేమెంట్ కోసం ప్రతిపాదనలు పంపించాలన్నారు. పనులు మొదలుకాని గొడౌన్‌లకు అనుమతులు రద్దు చేయాలని తెలిపారు. మిగిలిన వాటి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా సహకార శాఖ అధికారి పి.రమేష్, డీసీసీబీ సీఈవో ఉమామహేశ్వరరావు, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

షెడ్యూల్ తెగలు, కులాల హక్కుల పరిరక్షణకు పటిష్ట చట్టాలు


మాట్లాడుతున్న న్యాయమూర్తి హేమస్రవంతి జానకి రామ్

బొబ్బిలి: షెడ్యూల్ తెగలు, కులాలకు చెందిన ప్రజల హక్కుల పరిరక్షణకు రాజ్యాంగం ఏర్పాటు చేసిన చట్టాలు పటిష్టమైనవని స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి హేమ స్రవంతి జానకిరామ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కోర్టు ఆవరణ, ఎస్సీ బాలికల వసతిగృహంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌర హక్కుల రక్షణచట్టం(1955) షెడ్యూల్ కులాలు, తెగల అత్యాచారాల నివారణ చట్టం(1989)ప్రకారం ఆయా ప్రజల హక్కులు కాపాడడం, అత్యాచారాలు, దురాగతాలను నివారించడం, హక్కుల కల్పన,పునరావాసం వంటివి కల్పించడం జరుగుతుందన్నారు. వారి కోసం ప్రత్యేక న్యాయ విచారణ జరుగుతుందని చెప్పారు. వారిపై జరిగే నేరాలు, దౌర్జన్యాలను అరికట్టేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి ఉపశమన చర్యలు తీసుకునేందుకు పటిష్టంగా చట్టాలున్నాయని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎం.ఆనందకుమార్, రుంకాన ప్రసాద రావు, పలువురు సీనియర్ న్యాయవాదులు, కక్షిదారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

విజయనగరం క్రైమ్: వినాయక పండగ ఏర్పాట్ల సందర్భంగా విజయనగరంలో మంగళవారం ప్రమాదం సంభవించింది. నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి దాసన్నపేట రైతు బజార్ వద్ద పదో తరగతి చదువుతున్న విద్యార్థి కరెంట్ షాక్ తగిలి మృతువాత పడ్డాడు. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..సారిపల్లికి చెందిన ముగ్గురు విద్యార్థులు వినాయక పండగ నేపథ్యంలో దాసన్న పేట వద్ద సామగ్రి కొనుగోలుకు వచ్చారు. సాయంత్రం వేళ వర్షం పడుతుండడంతో దాసన్నపేట రింగ్ రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఆ ముగ్గురు విద్యార్థుల్లో ఇద్దరు రెయిలింగ్ దాటిన తర్వాత మూడో బాలుడు రెయిలింగ్ పట్టుకుని దాటుతున్న సమయంలో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికుల సాయంతో బాలుడ్ని సమీపంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌గా తరలించగా వైద్యులు పరీక్ష చేసి మరణించాడని చెప్పారు.

ఉత్సవాలకు స్వయంభూ వినాయకుడు సిద్ధం

- ఈ ఏడాది ఐదురోజుల పాటు ఉత్సవాలు
- భూమిలో పుట్టిన 'మంతిన' శిలావినాయకుడిది ప్రత్యేకత


మంతినలో భూమిలోంచి పుట్టిన శిలావినాయకుడు

రాజాం/సంతకవిటి: వినాయక చవితి అనగానే మంటపాలు వేయడం, ప్రతిమలు తీసుకురావడం నిమజ్జనం చేయడం షరామామూలే. సంతకవిటి మండలంలోని మంతిన గ్రామంలో నారాయణపురం కుడి కాలువ పక్కనే ప్రతిష్టించిన వినాయకుడికి ఈ చవితి పండగలో విశిష్టత ఉంటుంది. ఇక్కడ వినాయకుడికి గుడి కూడా ఉంది. 1960లో నారాయణపురం కుడికాలువ తవ్వుతున్న సమయంలో భూమిలోంచి రాతి(శిల) వినాయకుడి ప్రతిమ గ్రామస్తులకు లభించింది. అప్పట్లో ఈ ప్రతిమను కాలువ పక్కనే ఓ రావిచెట్టు వద్ద గ్రామస్తులు ప్రతిష్ఠించారు. అప్పటినుంచి ప్రతి ఏడాది ఇక్కడ వినాయకచవితికి గ్రామస్తులు పూజలు, వ్రతాలు నిర్వహిస్తారు. ఐదు రోజుల నుంచి తొమ్మిదిరోజులు పాటు ప్రత్యేక పూజలు, దర్శన కార్యక్రమాలు ఉంటాయి. ఈ ఏడాది ఎప్పటిలాగానే ఐదు రోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సర్పంచ్ ఈశ్వరరావు తెలిపారు.

నాలుగు అడుగుల భారీ విగ్రహం

అప్పట్లో ఇక్కడ ప్రతిష్టించిన వినాయకుడి ప్రతిమ ప్రస్తుతం పెరిగిందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి ఏడాది ఈ విగ్రహ పరిమాణంలో మార్పు ఉంటుందని తెలిపారు. భారీ కాయం, బొజ్జతో ఇక్కడి రాతి విగ్రహం ఆకర్షణీయంగా ఉంటుంది. నాలుగు అడుగుల ఈ శిలా విగ్రహాన్ని ఒక్క ఇంచ్ కూడా కదపలేదు. ఇక్కడ ఉత్సవాల సమయంలో మట్టి వినాయకుడి ప్రతిమ తెచ్చి పూజలు చేసి, అనుపు పండగ నిర్వహిస్తారు. మంతిన గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తమ ఇళ్లలో ఏ శుభకార్యక్రమం జరిగినా ముందుగా ఇక్కడే పూజలు చేసి మొక్కులు చెల్లిస్తారు.

వెలుగులో చీకటి కోణం

- పక్కదోవ పట్టిన స్త్రీ నిధి డబ్బుల కలెక్షన్
- రేగులపాడు వీఓఏకు నోటీసులు ఇచ్చిన ఏపీఎం


వీరఘట్టం వెలుగు కార్యాలయం

వీరఘట్టం: మండలంలోని దశమంతుపురం గ్రామానికి చెందిన గ్రామ సంఘం సహాయకురాలు(వీఓఏ) ఇటీవల గ్రామ సంఘాల సభ్యుల నుంచి కలెక్షన్ చేసిన రూ.2 లక్షలు స్త్రీ నిధి డబ్బులు బ్యాంకులో జమచేయకుండా సొంత అవసరాలకు వాడుకుని, అధికారుల తనిఖీల్లో పట్టుబడ్డారు.ఈ డబ్బులు వెంటనే కట్టకపోతే ఆమెను విధుల నుంచి తొలగిస్తామని వెలుగు అధికారులు నోటీసులు ఇవ్వడంతో ఆమె దారిలోకి వచ్చారు. సొంత అవసరాలకు వాడుకున్న డబ్బులను చెల్లించేందుకు ఒప్పుకున్నారు.ఈ వ్యవహారం మరువక ముందే మరో వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు ఏపీఎం కె.రాము మంగళవారం మీడియాకు తెలిపారు.రేగులపాడు గ్రామానికి చెందిన వీఓఏ తమ గ్రామంలో గ్రామ సంఘాల నుంచి కలెక్షన్ చేసిన స్త్రీనిధి డబ్బులు సుమారు రూ.1.18 లక్షలు పక్కదోవ పట్టించినట్లు గుర్తించామన్నారు.వెంటనే స్త్రీనిధి లోన్ డబ్బులు కట్టకపోతే ఆమెను విధుల నుంచి తొలగిస్తామని నోటీసులు పంపించినట్లు ఏపీఎం రాము తెలిపారు. అన్ని గ్రామ సంఘాల అకౌంట్లు కొద్ది రోజుల్లో తనిఖీ చేస్తామన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. కొరవడిన పర్యవేక్షణ..

వీరఘట్టం మండలంలో 50 గ్రామ సంఘాలు ఉన్నాయి. వాటి పరిధిలో 1,752 స్వయం సహాయక సంఘాలు ఉండగా 17,683 మంది మహిళలు డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. వారికి స్త్రీ నిధి కింద రూ.28.12 కోట్లు రుణాలుగా ఇచ్చారు.ఈ రుణాలను వీఓఏలు డ్వాక్రా సంఘాల నుంచి కలెక్షన్ చేసి స్త్రీనిధి బ్యాంకు ఖాతాకు జమచేయాల్సి ఉంది. అయితే కొంత మంది డ్వాక్రా సంఘాల సభ్యుల నుంచి కలెక్షన్ చేసిన డబ్బులను బ్యాంకులకు సకాలంలో కడుతుండగా ఇంకొందరు సొంత అవసరాలకు వాడుకుని తర్వాత కడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.అయితే ఇంకొందరు పూర్తిగా చెల్లించకుండా అడ్డంగా దొరికిపోతున్నారు. వెలుగు అధికారులు పర్యవేక్షణ చేసి ఉంటే ఇటువంటి తప్పిదాలు జరగవని పలువురు అంటున్నారు.

అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు



డ్వాక్రా సంఘాల సభ్యుల నుంచి కలెక్షన్ చేస్తున్న రుణాల రికవరీ డబ్బులను సకాలంలో బ్యాంకులో జమచేయాలి.అంతే తప్ప డ్వాక్రా సంఘాల మహిళల డబ్బులు సొంత అవసరాలకు వాడుకుని అక్రమాలకు పాల్పడితే అట్టివారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విధుల నుంచి తొలగిస్తాం.

– కె.లలితకుమారి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

బదిలీ కోసం ఎంఈవో1ల నిరీక్షణ

- విద్యాశాఖ డైరెక్టర్‌కు లేఖ
- అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం


అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం

పార్వతీపురం టౌన్: ఎంఈఓ 1లకు సాధారణ బదిలీలు కూడా నిర్వహించినట్టైతే రాష్ట్ర వ్యాప్తంగా అందరు ఎంఈఓలకు ఉపయోగకరంగా ఉంటుందని ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ్ రామరాజుకు అసోసియేషన్ పక్షాన లేఖ రాసినట్లు ఆయన మంగళవారం తెలిపారు. 2017 నుంచి మెజారిటీ ఎంఈఓ1లు ఎనిమిదేళ్లుగా ఒకే చోట పని చేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఈఓ1 లు బదిలీల కోసం ఆశతో ఎదురు చూస్తున్న నేపథ్యంలో అంతర్ జిల్లా బదిలీలతో పాటు ఎంఈఓ 1, 2 లకు జీరో సర్వీస్ తో సాధారణ బదిలీలు కూడా నిర్వహించేందుకు తగిన ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా విద్యాశాఖ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు సామల సింహాచలంతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయక్ బుక్యా రవి నాయక్‌లు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేకు కేసు నమోదు చేశామని సీఐ నారాయణమూర్తి చెప్పారు. ఈ నెల 22న బర్మా కాలనీకి చెందిన విద్యార్థిని కళాశాలకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. తర్వాత తిరిగి ఇంటికి రాకపోవడంతో, ఆమె కోసం బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ తెలియక పోవడంతో మంగళవారం ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం

- బయటకు తీసిన పోలీసులు


గుర్తు తెలియన మృతదేహం


చెరువులోంచి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చుతున్న ఏఎస్సై జనార్దన్, కానిస్టేబుల్ రమేష్

కొత్తవలస: మండలంలోని కొత్తసుంకరపాలెం గ్రామం సమీపంలో గల దత్తుడు చెరువులో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు మంగళవారం చూసి పోలీసులకు తెలిపారు.ఈ మేరకు ఘటనా స్థలానికి ఏఎస్సై జనార్దన్ రావు, కానిస్టేబుల్ ఎల్.రమేష్ వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని చెరువులోనుంచి ఒడ్డుకు తీసేందుకు స్థానికులు ఎవరూ సహకరించకపోవడంతో ఏఎస్సై జనార్దన్, కానిస్టేబుల్ రమేష్‌లు సాహసించి చెరువులో దిగి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతి చెంది మూడు రోజులకు పైగా కావడంతో విపరీతమైన దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు దగ్గరికి చేరలేదు. పోలీసులే మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చి క్షుణ్ణంగా పరిశీలించారు. కాగా మృతుడి వయస్సు సుమారుగా 50 సంవత్సరాలకు పైగా ఉంటుందని అంచనా వేశారు. ప్రాణాలను పణంగా పెట్టి సాహసించిన ఏఎస్సై, కానిస్టేబుల్‌ను సీఐ అభినందించారు. శవ పంచనామా నిర్వహించి ఎస్.కోట సీహెచ్‌సీలోని మార్చురీకి మృతదేహాన్ని తరలించినట్లు సీఐ షణ్ముఖ రావు తెలిపారు.

సచివాలయ ఉద్యోగి దుష్ప్రవర్తన

గుర్ల: మండలంలోని నాగళ్లవలస సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి కల్యాణిపై డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీపతి దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం. పంచాయతీ కార్యదర్శి చెప్పిన పనులు చేయకుండా తనకు నచ్చిన పనిని చేస్తానని, ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణతో పాటు దాడులు చేయడానికి సిద్ధపడుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి కల్యాణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి సిద్ధం అవుతుండగా మండల అధికారుల సూచనలతో ఫిర్యాదు చేయలేదు. ఈ విషయంపై ఎంపీడీఓ రవికుమార్ వద్ద ప్రస్తావించగా నాగళ్లవలస డిజిటల్ అసిస్టెంట్ దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆయనకు మెమో ఇవ్వడంతో పాటు ఈ విషయాన్ని డీపీఓ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.